క్లుప్తంగా

డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు

పాలకొండ: డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన టీడీ పారాపురం వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, ఇప్పటికే ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల చొరవతో నిధులు కూడా మంజూరయ్యాయన్నారు. బుధవారం డంపింగ్ యార్డు ప్రహరీ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నగర పాలకవర్గ సభ్యులు హాజరు కావాలని కోరారు.

గిరిజనులకు ఇళ్ల మంజూరుకు చర్యలు



పులిగుమ్మి ప్రాంతంలో ఇళ్ల మంజూరుకు స్థలం పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

సీతంపేట: ఫారెస్ట్ ఏరియాలో నివాసముంటున్న గిరిజనులకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. మండలంలోని పులిగుమ్మి, సీదిగూడ, కుడ్డపల్లి గ్రామాలను మంగళవారం సందర్శించిన ఆయన ఫారెస్ట్ ఏరియాలో ఇళ్లు మంజూరు చేయడం సాధ్యం కాదని, ఈ నేపథ్యంలో అక్కడ నివాసముంటున్న వారిని రెవెన్యూ పరిధిలోకి తీసుకువచ్చి, ఇళ్లు మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం పులిగుమ్మి ప్రాంతంలో గిరిజనులకు ఇళ్లు మంజూరు చేసేందుకు స్థలం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భామిని: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ ఎ.సునీత తెలిపారు.

రుణాల వసూలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏపీఎం భవాని

భామిని: మహిళా సంఘాలు తీసుకున్న రుణాల వసూలపై దృష్టిసారించాలని వెలుగు ఏపీఎం దొడ్ల భవాని, ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు నిమ్మల నీలమ్మ సూచించారు. స్థానిక మండల కేంద్రంలో మంగళవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉన్నతి, స్త్రీనిధి రుణాలను వసూలు చేసి, కొత్త సంఘాల సభ్యులకు అందజేయాలని తద్వారా మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి



గ్రామసభలో సోషల్ ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) చేపడుతున్న సిబ్బందికి వేతనదారులు కూడా సహకరించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి కోరారు. మంగళవారం మండలంలోని పెదగుడబ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్ నిర్వహించి, అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు దాదాపు రూ.11.75 కోట్ల వ్యయంతో 519 పనులు చేపట్టడం జరిగిందని, ఆయా పనులకు సంబంధించి, గ్రామంలో సోషల్ ఆడిట్ చేయడం జరుగుతోందన్నారు. పక్కాగా పనుల నిర్వహణకే ఈ ఆడిట్ అని, అందరూ ఆడిటర్లకు సహకరించాలన్నారు. సమావేశంలో ఏపీఓ టి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎ.రమేష్, ఎస్‌ఆర్‌పీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదే..

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: ఎన్నికల హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోతాం గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వై.ముత్యాలు, దిగువ ముత్యాలు, మధ్య ముత్యాలు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడా అమలు కానన్నీ పథకాలు ఇక్కడ అమలవుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఎవరైనా పథకం కోసం దరఖాస్తు చేసుకున్న కొన్ని రోజులకే పథకం మంజూరవుతోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెబితేనే పథకాలు అందేవన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాజకీయ, పార్టీ, ఇతర పదవుల్లో అన్ని వర్గాల వారికి సమాన ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన మరెన్నో హామీలను ఆయన నెరవేరుస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల స్థాపన ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు తీసుకువచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.రాము, కృష్ణ, వెంకీ, ఎస్.రమేష్, రంగారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు సూచించారు. మండలంలోని సింగన్నవలస గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి సచివాలయం గడప తొక్కే వారిని సాదరంగా ఆహ్వానించి, వారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన సూచించారు. అలాగే అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ఆరాతీశారు. వేసవి నేపథ్యంలో వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. పనిప్రదేశంలో తప్పకుండా తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి

- జనవిజ్ఞాన వేదిక సదస్సులో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి



చిన్నారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

కురుపాం: చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి సూచించారు. మండలంలోని గుజ్జువాయి పంచాయతీ పరిధి, ఎగువకొత్తగూడ గ్రామంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన ఈ మధ్యకాలంలో యువత ఎక్కువగా మద్యపానానికి బానిసలై, వారి బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, కుటుంబాల్లో విషాదం నింపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత సన్మార్గంలో నడిచి, ఆదర్శంగా నిలవాలని కోరారు. మనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను మోసం చేయకూడదన్నారు. ఉన్నత స్థానాల్లో స్థిరపడి, వారికి మంచిపేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజీ మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్ అని, విద్యార్థులంతా బాగా చదువుకుని, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, ఒక్క చదువు వల్లే పేదరికాన్ని జయించగలమన్నారు. మూఢనమ్మకాలు వీడి, సత్యం వైపు అడుగులు వేయాలన్నారు. సదస్సులో సర్పంచ్ హిమరిక నాగేశ్వరరావు, కురుపాం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నాగేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలక రంజిత్‌కుమార్, జిల్లా కార్యదర్శి డి.చంద్రమౌళి, జిల్లా సంయుక్త కార్యదర్శి కొండగొర్రి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



పాలకొండ రూరల్: మాట్లాడుతున్న సాహితీవేత్త సూర్యం



సీతంపేట: పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ నైతిక విలువలు పెంపొందించుకోవాలని సాహితీవేత్త, ఉపాధ్యాయుడు గారాల సూర్యం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో 'మంచి సూక్తులు' అనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పూర్తిగా ఆటలు ఆడుతూ, సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లు చూస్తూ సమయం వృథా చేయొద్దన్నారు. అందరూ గ్రంథాలయానికి వచ్చి, మంచి మంచి పుస్తకాలు చదువుకుని, జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. విరామచిహ్నాలు పాటిస్తూ అర్థవంతమయ్యేలా ఎలా చదవాలో తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



శస్త్ర చికిత్స విభాగం తెలిపే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ: ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని మంగళవారం సందర్శించిన ఆమె ఇంటింటికీ వైద్యసేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఆస్పత్రిలో అందించే సేవలు, పలు విభాగాలను సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత సంబరాలు



గ్రామదేవత అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

భామిని: మండలంలోని నేరడి-బి గ్రామంలో గ్రామదేవత సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలంతా కలశాలలతో పవిత్ర నదీజలాలు తీసుకువచ్చి, అమ్మవారికి చల్లదనం చేశారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు చేపట్టారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. మండలంలోని పెదగుడబ పంచాయతీ, ఎస్‌ఆర్ పేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది పలువురికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని పరిశీలించిన ఎంపీడీఓ ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తగ్గిన జీడిపిక్కల ధర



రంగుమారిన జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

కురుపాం: స్థానిక మార్కెట్‌లో జీడిపిక్కల ధర బాగా పడిపోయింది. దీంతో జీడిమామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు కేజీ రూ.90 నుంచి రూ.102 ధర ఉండేదని, ఇప్పుడు అమాంతం రూ.80కు పడిపోయిందని వాపోతున్నారు. చాలా తక్కువ రోజుల వ్యవధిలోనే ఒక్కసారిగా ధర తగ్గిస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులే చొరవ తీసుకుని, పంటకు గిట్టుబాటు ధర ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా వ్యాపారులు మాత్రం రంగుమారిన పిక్కలను కూడా రూ.80కు కొనుగోలు చేస్తున్నామని, నాణ్యమైన పిక్కలైతే కిలో రూ.85 చొప్పున కొనుగోలు చేస్తున్నామంటున్నారు.

మందకొడిగా రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కురుపాంలో తొలగించిన ఆక్రమణలు

కురుపాం: స్థానిక మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించి, చాలా రోజులైనా విస్తరణ పనులు చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, త్వరితగతిన పనులు చేపట్టి, పూర్తి చేయాలని కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పద్మాపురం గ్రామంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి, వాటపాగు, పద్మాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. ఒక్కో గ్రామంలో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో గతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను చేపట్టనున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు కె.సంధ్యారాణి, వి.రాజారావు, వైస్ సర్పంచ్ లక్ష్మంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మన్మథరావు, గోవిందరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కనిష్కవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజీ



మాట్లాడుతున్న పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజీ

కురుపాం: నిర్దేశిత లక్ష్య సాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్ కృష్ణాజీ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించి, చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మాణ దశలోని ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తుంటే పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటి వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల ఇంజినీరింగ్ అధికారి ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న ఎండలు



భామిని: ఎండల కారణంగా నిర్మానుష్యంగా భామిని మండల కేంద్రం ప్రధాన రోడ్డు



గుమ్మలక్ష్మీపురం: మండుటెండలో గొడుగు నీడలో నడిచివెళ్తున్న మహిళలు

భామిని/గుమ్మలక్ష్మీపురం: ఎండలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మండలంలోని పలుచోట్ల ప్రధాన రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే చాలు ఎండ ధాటికి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఒకవేళ అత్యవసరమై వెళ్లాల్సి వస్తే గొడుగు, వాటర్‌బాటిల్ వెంట తీసుకువెళ్లాల్సి వస్తోంది. కొన్నిసార్లు కొంతమంది వడదెబ్బ బారినపడి ఆసుపత్రిపాలు అవ్వాల్సి వస్తోంది. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

'స్పందన' సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

భామిని: స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం మంగళవారం వీక్షించిన ఆయన ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి, నేరుగా ముఖ్యమంత్రికి సమస్యలు విన్నవించుకోవచ్చన్నారు. ఆయన వరకు సమస్యలు వెళ్లకుండా ఇక్కడే సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యక్రమ విధివిధానాల అమలుపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, ఎంఏఓ కె.సింహాచలం, వైద్యాధికారి ఫణికుమార్, ఎస్‌ఐ అమ్మానరావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సిరిమానోత్సవం



సిరిమానోత్సవానికి ముందు అంజలిరథంపై తిరుగుతున్న పేడి వేషధారులు

పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా వీరఘట్టం మండల కేంద్రంలో మంగళవారం సిరిమానోత్సవం కనులపండువగా నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల్లో అశేష జనవాహిని నడుమ సిరిమాను తిరువీధి జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో నిత్యం వర్ధిల్లాలని వేడుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు కళాకారులు వేసిన అమ్మవారి వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. –వీరఘట్టం సాక్షి నెట్‌వర్క్



సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులు



సిరిమానుకు మొక్కుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్







ఆకట్టుకున్న కాళీమాత, వరాహనరసింహుడు, దుర్గాదేవి వేషధారణలు